## రైతులకేం చెప్పాలి..



కేసీఆర్ సర్కారు హయాంలో రుణమాఫీ కోసం పంపించిన విధంగానే ఈ సారి కూడా లిస్ట్‌ను పంపించాం. కానీ 499 మందిలో ఒక్కరికి కూడా మాఫీ కాలేదు. రైతులు నిత్యం సొసైటీ చుట్టూ తిరుగుతున్నారు. వారికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడంలేదు. నేను బీఆర్ఎస్ మద్దతుతో సింగిల్‌విండో చైర్మన్‌గా ఉండడం మూలంగానే మా సొసైటీలో ఒక్కరికి కూడా మాఫీ కాలేదోమోనని అనుమానంగా ఉన్నది. మంత్రి జూపల్లి స్థానికంగా ఉన్న సొసైటీలో ఒక్కరికి కూడా రుణమాఫీ కాకపోవడం దురదృష్టకరం.

**– విజయరామారావు, పెంట్లవెల్లి సింగిల్ విండో చైర్మన్**

## ఒక్కపైసా కూడా రాలేదు..



కొల్లాపూర్ సొసైటీలో రూ.1.50 లక్షల క్రాప్‌లోన్ తీసుకున్నాను. మా కుటుంబంలో నేను ఒక్కడినే పంట రుణం పొందాను. రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకున్నా నేను అర్హుడిని. కానీ, ఎందుకు మాఫీ కాలేదో అర్థం కావడం లేదు. నాకు న్యాయం చేయాలి. అందరికీ రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఆచరణలో చేయలేదు. బ్యాంకు అధికారులను అడిగితే ఏవేవో కారణాలు చెబుతున్నారు. కానీ స్పష్టం ఇవ్వడం లేదు.

**– బర్ల ఈశ్వర్‌రెడ్డి, రైతు, కొల్లాపూర్**

## రూ.40 వేలు కూడా మాఫీ కాలే..



నాకు మస్తీపూర్‌లో రెండెకరాల పొలం ఉన్నది. రెండేండ్ల కిందట అమరచింత యూనియన్ బ్యాంకులో రూ.40 వేల లోన్ తీసుకున్నాను. కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే రూ.2 లక్షల లోన్ మాఫీ చేస్తామని చెప్పడంతో అప్పు తెచ్చి బ్యాంకులో రుణం కట్టి రెన్యూవల్ చేసుకున్నాను. నా లోన్ రూ.లక్ష లోపే ఉన్నందున మొదటి విడుతలోనే వస్తుందని ఆశపడ్డాను. ఇప్పుడు సర్కారోళ్లు ఇచ్చిన మూడు విడుతల లిస్ట్‌ల్లో నా పేరు లేదు. నాకు వయస్సు సహకరించకపోయినా నెల నుంచి బ్యాంక్, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాను.

**– అనంతమ్మ, మస్తీపూర్, అమరచింత మండలం, వనపర్తి జిల్లా**



పాలమూరు విశ్వవిద్యాలయం ముఖద్వారం

# పీయూపై పట్టింపేదీ..?

- అభివృద్ధికి నయాపైసా విదిల్చని రాష్ట్ర ప్రభుత్వం
- వీసీ, రిజిస్ట్రార్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ పోస్టులన్నీ ఖాళీనే..
- సీఎం సొంత జిల్లాలో గంపెడాశలన్నీ గల్లంతే..

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 26 : పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించడంతో ఉమ్మడి జిల్లాలో ఉన్నత విద్యకు పెద్దదిక్కుగా ఉన్న 'పాలమూరు విశ్వవిద్యాలయం' మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతారని అంతా భావించారు. కానీ రేవంత్‌రెడ్డి ఈ ఏడాది యూనివర్సిటీ అభివృద్ధి కోసం ఒక్కరూపాయి నిధులు కూడా విదిల్చలేదు. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లావాసులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యకు సముచిత స్థానం ఇస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్న సీఎం మాటలన్నీ నీటి మూటలే అని తేలిపోయాయని అంటున్నారు.

**పోస్టులు ఖాళీ..**

విశ్వవిద్యాలయానికి అత్యంత ప్రధానమైన ఉప కులపతి, రిజిస్ట్రార్ ఈ రెండు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. పీయూ పరిపాలనా మండలి (13 మంది సభ్యులతో కూడిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) గడువు ముగిసి ఆర్నెళ్లు అవుతుంది. ముఖ్యంగా ఆచార్యుల కొరత వేధిస్తోంది. బోధన, పరిశోధన, పరిపాలనా రంగాల్లో కీలకమైన భూమిక పోషించే ఆచార్యుల నియామకాలు లేక పదేళ్లు అవుతోంది. పీయూలోని అన్ని విభాగాల్లో కలిపి 95 మంది ఆచార్యులకుగానూ 19 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. పీయూతో అనుబంధంగా ఉన్న నాగర్‌కర్నూల్, జోగుళాంబ-గద్వాల, వనపర్తి జిల్లాల పరిధిలోని పీజీ సెంటర్లలో కూడా ఆచార్యుల పోస్టులు 75 శాతానికిపైగా ఖాళీలు ఉన్నాయి. బోధనేతర సిబ్బంది పోస్టులు మొత్తం 16కుగానూ కేవలం రెండు పోస్టులు మాత్రమే భర్తీకి నోచుకోగా మిగిలిన 14 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

విశ్వవిద్యాలయంలో మొత్తం 17 విభాగాల్లో 19 కోర్సులు ఉన్నాయి. ప్రతి విభాగంలో ఒక ఆచార్యుడు విధిగా ఉండాలనే నిబంధన ఉన్నా 15 ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వసతి గృహాల కొరత తీవ్రంగా ఉన్నది. పీయూలో మహిళల సంఖ్య ఎక్కువగా ఉండడంతో సరిపడా లేక ఒక్కో గదిలో 10 నుంచి 14 మంది విద్యార్థినులు ఉంటున్నారు. పురుషులకు మూడు వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు కిటికీలు ఊడి.. బాత్రూం డోర్‌లు సరిగా లేక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. పీహెచ్‌డీ కోర్సులు అందుబాటులో ఉన్నా.. పరిశోధక విద్యార్థులకు ఎలాంటి వసతి సౌకర్యాలు లేవు. వర్సిటీ సముదాయంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది మొత్తం కలుపుకొని సుమారు 2 వేల మందికిపైగా ఉంటారు. పీయూలో పీజీ, ఫార్మసీ, ఎంఈడీ అకాడమిక్ కళాశాల భవనాలు, బాలుర, బాలికల వసతి గృహాలతోపాటు పరిపాలన భవనం, గ్రంథాలయం, ఆడిటోరియం, సైన్స్ బ్లాక్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, హెల్త్ సెంటర్, వీసీ నివాస సముదాయం ఇలా అనేక విభాగాలు ఉన్నాయి. వీటన్నింటికీ నిత్యం రాకపోకలు సాగించే వారిపై పూర్తిస్థాయిలో నిఘా కరువైంది. సిబ్బంది, అధ్యాపకులకు బయోమెట్రిక్ యంత్రాలు ఉన్నా.. వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 81 డిగ్రీ కళాశాలలు ఉండ గా అందులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు 20, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు 61 ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 32వేలకు పైగా సీట్లకుగానూ ఇప్పటి వరకు దోస్త్ ద్వారా 12 వేలకు పైగా మాత్రమే భర్తీ అయ్యాయి.

**నయాపైసా రాలే..**

ఈ ఏడాది 2024-25 విద్యా సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.11.74 కోట్లు.. ఇవి వేతనాలకు మాత్రమే విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయించినా.. అందులో పాలమూరు వర్సిటీకి ఇప్పటి వరకు ఒక్కరూపాయి కూడా అందలేదు. కేంద్ర ప్రభుత్వం సైతం పీఎం ఉషా పథకం కింద రూ.100 కోట్లు మంజూరు చేసినా.. అవి నేటికీ కాగితాలకే పరిమితమయ్యాయి. ఇప్పటికైనా నిధులు విడుదల చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.



ఆరుబయట బట్టలు ఉతుక్కుంటున్న విద్యార్థి



పీయూలో సమస్యలు పరిష్కరించాలంటూ విద్యార్థుల ఆందోళన (ఫైల్)

# మాయాజాలం!

- కొల్లాపూర్ నియోజకవర్గంలో రుణమాఫీ చిత్రవిచిత్రాలు
- అధికారులు పంపిన లిస్ట్‌కు భిన్నంగా జాబితా విడుదల
- అర్హత ఉన్న వారికి మాఫీలో చోటు దక్కని వైనం
- పీఏసీసీఎస్‌లలో కటాఫ్ తేదీ తర్వాత తీసుకున్న వారికీ లబ్ధి?
- మొదటి విడుతలో నయాపైసా ఇవ్వని సర్కారు
- పెంట్లవెల్లి సొసైటీలో ఇప్పటికీ ఒక్కరికి కూడా మాఫీ కాలే..
- ప్రశ్నిద్దామని వెళ్లిన రైతులకు గేట్లతాళాలే దర్శనం
- మంత్రి జూపల్లి ఇలాకాలో గందరగోళం




పెంట్లవెల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం

కొల్లాపూర్, ఆగస్టు 26 : ఎన్నికల ముందు క్రాప్ లోన్ తీసుకున్న రైతులందరికీ మాఫీ చేస్తామని, ఎవరైనా తీసుకోని వారు ఉంటే వెంటనే వెళ్లి తీసుకోవాలని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తరువాత కొర్రీలు పెడుతున్నది. అర్హత ఉన్న చిన్న, సన్నకారు రైతులను నిలువునా మోసం చేస్తున్నది. మొదటి విడుత రుణమాఫీలో నియోజవర్గంలోని అన్ని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం సొసైటీల్లో కలిపి ఒక్క రైతుకు కూడా చోటు దక్కలేదంటే మంత్రి జూపల్లి ఇలాకా పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది.

కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సొసైటీలకు రాజకీయ గ్రహణం పట్టుకున్నది. కాంగ్రెస్ సర్కారు చేపట్టిన రూ.2 లక్షల రుణమాఫీ.. రైతుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొనేలా చేసింది. మంత్రిగా ప్రాతినిథ్యం వహిస్తున్న జూపల్లి కృష్ణారావు సెగ్మెంట్‌లోని అన్ని సహకార సంఘాల్లో మాయాజాలం చోటు చేసుకున్నది. చిత్ర విచిత్రమైన సంఘటనలు ఒక్క కొల్లాపూర్‌లోనే దర్శనమిస్తుండడం విశేషం. అర్హత ఉన్నవారికి మాఫీ కాకపోవడం.., అర్హత లేని వారికి చోటు దక్కడం.., ప్రభుత్వ కటాఫ్ తేదీ తరువాత లోన్ తీసుకున్న వారికి కూడా లబ్ధి చేకూరడం వంటి విచిత్రాలు ఇక్కడే కనిపిస్తున్నాయి. ప్రభుత్వం విధించిన కటాఫ్ తేదీలోగా తీసుకున్న రుణంలో కూడా పది శాతమే మాఫీ అయ్యింది. ఇదేమిటని సొసైటీల వద్దకు వెళ్లి ప్రశ్నిద్దామనుకున్న రైతులకు గేట్ల తాళాలే ఎదురుపడుతున్నాయి. నియోజకవర్గంలోని 8 సొసైటీ బ్యాంకుల కింద 9,676 మంది అర్హత కలిగిన రైతుల జాబితాను రూపొందిస్తే.. ఇందులో 4,559 మందికి మాత్రమే మాఫీ అయ్యింది. మిగిలిన 5,117 మందికి చోటు దక్కలేదు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో అనేక సార్లు సమీక్షలో పాల్గొన్న మంత్రి జూపల్లికి సెగ్మెంట్ నుంచి చేదు అనుభవాలే దక్కుతున్నాయి. పెంట్లవెల్లి సొసైటీలో మూడు విడుతల్లో కలిపి ఒక్క రైతుకు కూడా రుణమాఫీ కాకపోవడం ఇంకో విచిత్రం.., రైతులను సొసైటీల్లోకి రాకుండా గేట్లకు ఎందుకు తాళాలు వేశారో తెలియకపోవడం శోచనీయం. ఒకవేళ మంత్రి కనుసన్నల్లోనే మాఫీ జరిగిందా? అనే సందేహాలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

**పెంట్లవెల్లి సొసైటీలో..**

పెంట్లవెల్లి సొసైటీలో 499మంది రైతులు ప్రభుత్వం విధించిన కటాఫ్ తేదీలోగా క్రాప్‌లోన్ తీసుకున్నారు. వారందరూ సర్కారు నిబంధనల పరిధిలోనే ఉన్నారు. అయితే, ప్రభుత్వం ప్రకటించిన మూడు విడుతల రుణమాఫీ ఒక్కరికి కూడా చోటు దక్కలేదు. అర్హత ఉన్నా తమకెందుకు మాఫీ కాలేదని తెలుసుకునేందుకు రైతులు నిత్యం బ్యాంకులు, సొసైటీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి అలసిపోయారు. ఇదిలా ఉండగా, మొదటి విడుత రుణమాఫీ ప్రారంభోత్సవంలో భాగంగా పెంట్లవెల్లి మండలకేంద్రం సమీపంలోని రామాపురం రైతు వేదికలో మంత్రి జూపల్లి ముఖ్యమంత్రితో వీసీలో పాల్గొన్నారు. అయితే, పెంట్లవెల్లి రైతులు సమావేశానికి హాజరుకాగా.. మాఫీ కాని వారందరూ నిరాశగా వెనుదిరిగారు. 499మంది రైతులకుగానూ రూ. 3.26 కోట్లు విడుదల కావాల్సి ఉన్నది.

**కొల్లాపూర్, మాచినేనిపల్లి సొసైటీల్లో..**

కొల్లాపూర్ సొసైటీలో అర్హత ఉన్న రైతులకు మొండి 'చెయ్యి' చూపగా.. అర్హత లేని రైతులకు రుణమాఫీ కావడం సంచలనంగా మారింది. మాచినేనిపల్లి సొసైటీలో 50 శాతం మందికి మాత్రమే మాఫీ అయ్యింది. సొసైటీలు పంపించిన లిస్ట్‌కు భిన్నంగా అర్హత లేని వారి పేర్లు రావడం విశేషం. దీంతో ఎవరి ప్రమేయంతో ఇలా అనర్హత ఉన్నవారికి మాఫీ అయ్యింది అనే ప్రశ్నలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. కొల్లాపూర్ సొసైటీలో 2,416 మంది ఉండగా.. 1,535 మందికి మాఫీ అయ్యింది. మిగిలిన 881 మంది రైతులకుగానూ రూ. 7,92,67, 103 బడ్జెట్ రావాల్సి ఉన్నది. మాచినేనిపల్లి సొసైటీ లో 540 మంది రైతులకుగానూ 248మందికి మాత్రమే మాఫీ అయ్యింది. మిగిలిన 292మందికి గానూ రూ. 21,97,68,014 మంజూరు కావాల్సి ఉన్నది.

**కోడేరు, కొండ్రావుపల్లి, నార్సాయిపల్లి సొసైటీల్లో..**

కోడేరు పీఏసీసీఎస్‌లో 2,684మంది రైతులుంటే 1,007 మందికి రుణమాఫీ అయ్యింది. మిగిలిన 1,677 మందికి రూ.17,31,60,229 నిధులు అవసరమవుతాయి. కొండ్రావుపల్లిలో 259 మందికిగానూ 122 మందికి చోటు దక్కగా.. మిగిలిన 137మందికి రూ.85,76,671 డబ్బులు రావాల్సి ఉన్నది. నార్సాయిపల్లిలో 288 మందికిగానూ 104 మందికి మాత్రమే మాఫీ కాగా.. మిగిలిన 174 మందికి రూ.11,17,9,298 నిధులు రావాల్సి ఉన్నది.

**కొత్తపేట, పెద్దకొత్తపల్లి సొసైటీల్లో..**

కొత్తపేట పీఏసీసీఎస్‌లో 2,073 మందికిగానూ 1,108 మంది రైతులకు రుణమాఫీ అయ్యింది. మిగిలిన 965 మంది రైతులకు రూ.10.18 కోట్ల మాఫీ కావాల్సి ఉన్నది. పెద్దకొత్తపల్లి సొసైటీలో 917 మంది రైతులకుగానూ 425 మందికి మాత్రమే లబ్ధి చేకూరగా.. మిగిలిన 492 మంది రైతులకు రూ. 3.60 కోట్లు మాఫీ కావాల్సి ఉన్నది.



కొల్లాపూర్ సొసైటీ గేట్లకు తాళాలు వేయడంతో గోడ దూకుతున్న రైతు (ఫైల్)

# నర్సిరెడ్డి పోరాట ఫలితమే భీమా

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ప్రజలకిచ్చిన మాటకు కట్టుబడి పనిచేశా : చిట్టెం
- సాగునీటి ఉద్యమంలో నేనూ పాల్గొన్నా.. : ఎంపీ అరుణ
- క్రమశిక్షణకు మారుపేరు నర్సిరెడ్డి : ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, శ్రీహరి



నర్సిరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్, ఆగస్టు 26 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో భీమా ప్రాజెక్టు సాధనలో స్వర్గీయ చిట్టెం నర్సిరెడ్డిది చెరగని ముద్ర అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మక్తల్‌లో నిర్వహించిన చిట్టెం నర్సిరెడ్డి 95వ జయంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు శ్రీహరి, పర్ణికారెడ్డి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం స్థానిక మినీ ట్యాంక్ బండ్‌పై నర్సిరెడ్డి విగ్రహాన్ని పునః ప్రతిష్ఠాపన చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాస్‌గౌడ్ హాజరై మాట్లాడారు. నర్సిరెడ్డి విగ్రహ పునః ప్రతిష్ఠాపనలో తాను పాల్గొనడం ఆనందాన్ని కలిగించిందన్నారు. నేడు ఈ నియోజకవర్గంలో రైతులకు సాగునీరు అందుతుందంటే అది ఆయన చలవేనన్నారు. సార్ చేసిన పోరాట ఫలితంగా భీమాను సాధించుకున్నామన్నారు. రాజకీయంలో ఎలాంటి మచ్చ లేని వ్యక్తి ఆయనని గుర్తు చేశారు.

**నాన్న, తమ్ముడులేని లోటును ప్రజల్లో చూసుకున్నా..**

2005లో అభివృద్ధి పనుల్లో పాల్గొన్న తన తండ్రి, తమ్ముడితోపాటు 9మంది ప్రాణాలు కోల్పోయారని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి గుర్తు చేశారు. ఇద్దరూ లేని లోటును రాజకీయాల్లోకి వచ్చి 18 ఏండ్లుగా ప్రజల్లో చూసుకున్నానన్నారు. వారి సమస్యలను నా సమస్యలుగా భావించి వారికి అండగా నిలిచానని, తన స్వలాభం కోసం ఏనాడూ పనిచేయలేదన్నారు. నా తండ్రి ఆశయాలను నెరవేర్చాలన్న సంకల్పంతో గుండెను రాయి చేసుకొని పుట్టెడు దుఃఖంతో నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచానన్నారు. స్థానిక ప్రజలు నన్ను గుండెల్లో చేర్చుకొని నా వెంటే ఉండడం చాలా సంతోషాన్నిచ్చిందన్నారు.

**గౌరవం కలిగిన వ్యక్తి నర్సిరెడ్డి : ఎంపీ**

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం మొక్కవోని దీక్షతో ఉద్యమాలు చేపట్టిన ఘనత నర్సిరెడ్డిదని, రాజకీయాల్లో ఆయన అజాత శత్రువుగా పేరొందారని ఎంపీ అరుణ పేర్కొన్నారు. విలువలతో కూడిన రాజకీయాన్ని నేర్పింది మా తండ్రే అని.. క్రమశిక్షణతో మా కుటుంబంలో గౌరవం కలిగిన వ్యక్తి ఆయనన్నారు. అప్పటి సీఎం వైఎస్సార్ వద్ద గట్టిగా కొట్లాడిన మహా నేత నర్సిరెడ్డి అని, ఆయన పోరాట ఫలితంగానే నేడు మక్తల్‌కు భీమా ఫేజ్-1లో సంగంబండ నుంచి సాగునీటికి నాంది పలికిందన్నారు. సాగునీటి ఉద్యమంలో పాల్గొన్న అన్నారు.

**మహానుభావుడు నర్సిరెడ్డి : ఎమ్మెల్యేలు**

18 ఏండ్ల కిందట ఆగస్టు నెల తమ కుటుంబానికి సంతోషాన్ని దూరం చేసి దుఃఖాన్ని మిగిల్చిందని నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. మా తాత నర్సిరెడ్డి పర్యవేక్షణలో నా బాల్యమంతా గడిచిందని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ముందుంటానన్నారు. అలాగే ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ క్రమ శిక్షణ కలిగిన రాజకీయ జీవితాన్ని నర్సిరెడ్డి సార్ నుంచి నేర్చుకున్నానని అన్నారు. తన రాజకీయ జీవితంలో మొద టి విజయాన్ని అందించిన ఘనత ఆయనదే అని గుర్తు చేశారు. అలాంటి మహానుభావుడి విగ్రహ పునః ప్రతిష్ఠలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులు, చిట్టెం అభిమానులు, మక్తల్ నియోజకవర్గ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భజరే నందగోపాల..

- వైభవంగా గోకులాష్టమి
- కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు
- కిటకిటలాడిన ఇస్కాన్ ఆలయాలు
- ఉత్సాహంగా.. ఉట్ల వేడుక

*'గోకుల కృష్ణ.. గోపాల కృష్ణ మాయలు చాలయ్యా.. మా కన్నులలో దీపాలు వెలిగే పండుగ తేవయ్యా'.. 'జయ జనార్దన.. క్రిష్ణ రాధికా పతే.. జన విమోచనా క్రిష్ణ జన్మ మోచనా'.. 'ముకుందా.. ముకుందా.. క్రిష్ణా ముకుందా.. ముకుందా'.. అన్న పాటలు హోరెత్తాయి. సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరిగాయి. నెత్తిన నెమలి పింఛం.. చేతిలో పిల్లనగ్రోవి.. మోమున చిరుమందహాసంతో నల్లనయ్య గోపికలతో కలిసి విహరించడంతో ఇలా బృందావనంలా మారింది. ఇస్కాన్ ఆలయాలను సుందరంగా ముస్తాబు చేయగా.. గోవర్ధన గిరిధారికి భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. కన్నయ్య, గోపికల వేషధారణలో చిన్నారులు ముద్దులొలికించగా చూసి వారి తల్లిదండ్రులు మురిసిపోయారు. సాయంత్రం పలు ప్రాంతాల్లో ఉట్ల వేడుక సంబురంగా సాగింది. చిన్నారులు, యువకులు ఉట్లు కొట్టేందుకు పోటీపడగా.. ప్రజలు ఉత్సాహ పరిచారు.*

*– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, ఆగస్టు 26*






నాగర్‌కర్నూల్‌లో ఉట్టు కొడుతున్న చిన్నారులు

# జూరాల @ 24 గేట్లు

- 93 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలకు పెరుగుతున్న వరద

గద్వాల, ఆగస్టు 26 : ఎగువన భారీ వర్షాలు కురుస్తుండడంతో జూరాల వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతున్నది. సోమవారం జూరాల ప్రాజెక్టుకు 93 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. దీంతో 24 గేట్లను ఎత్తి దిగువకు వరదను వదులుతున్నారు. పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.855 టీఎంసీలుగా ఉన్నది. కాగా, నెట్టెంపాడ్ లిఫ్ట్‌కు 750, ఎడమ కాల్వకు 820, కుడి కాల్వకు 496, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఐదు యూనిట్లలో 31,689 క్యూసెక్కులను వినియోగిస్తూ విద్యుదుత్పత్తి చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు నుంచి మొత్తం 1,29,228 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.

**పోటెత్తిన వరద**

అయిజ, ఆగస్టు 26 : కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద పోటెత్తుతున్నది. ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 75,694, అవుట్‌ఫ్లో లక్ష క్యూసెక్కులుగా నమోదైంది. గరిష్ఠస్థాయి నీటి మట్టం 1705 అడుగులకుగానూ ప్రస్తుతం 1704.53 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 129.72 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 127.10 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 1.10 లక్షలు, అవుట్‌ఫ్లో 1,20,800 క్యూసెక్కులుగా నమోదైంది. గరిష్ఠస్థాయి నీటిమట్టం 1615 అడుగులకుగానూ ప్రస్తుతం 1614.07 అడుగులుగా ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 36.91 టీఎంసీలుగా ఉన్నది.

**టీబీ డ్యాంకు స్వల్పంగా..**

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 20,481, అవుట్‌ఫ్లో 10,075 క్యూసెక్కులుగా ఉన్నది. గరిష్ఠ నీటి నిల్వ 105.788 టీఎంసీలకుగానూ ప్రస్తు తం 86.876 టీఎంసీల నిల్వ ఉన్నది. అలాగే ఆర్డీఎస్ ఆనకట్టకు 4,329 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 3,700 క్యూసెక్కుల వరద సుంకేసుల బ్యారేజీకి చేరుతున్నది. ఆయకట్టుకు 629 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 8.6 అడుగుల మేరకు నీటి మట్టం ఉన్నట్లు ఆయా ప్రాజెక్టుల అధికారులు వెల్లడించారు.